# పెళ్ళానికి ప్రేమ లేఖ!

డియర్ విమలా!

నువ్వివాళ తప్పకుండా వొస్తావని సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌కి స్టేషన్‌కెళ్ళాను. ఎంతమంది దిగారు! నువ్వు దిగలేదు! ఎంత విచారం వేసిందో తెలుసా? నువ్వెళ్ళి వారం రోజులైంది. రోజులూ తారీఖులూ మర్చిపోయి నట్టున్నావు. పెద్ద కబుర్లు చెప్తావుగానీ .... ఉత్త పల్లెటూరి పిల్లలాగ పుట్టిల్లంటే నువ్విలా అతుక్కు పోతావనుకోలేదు. ఈ వారం రోజులూ నేనసలు సరిగ్గా అన్నం తినలేదు తెలుసా? నువ్వు చేసిపోయావుగా ఏవో పచ్చళ్ళూ .... అవన్నీ అలాగే వున్నాయి. కోర్టు నించొచ్చి అన్నం వొండుకోవాలంటే బద్ధకం. 'ఈ పూటకి మానేస్తే ఏం పోతుందిలే' అని .... వరసగా నాలుగు రాత్రుళ్ళు అన్నం మానేశాను.

అరటి పళ్ళు తిన్నాననుకో. ప్రతిరోజూ ఎక్కణ్ణించో దొంగ పిల్లి వొచ్చి పాలన్నీ తాగేస్తోంది. పాలగిన్ని అలమారులో పెట్టాలనుకుని మర్చిపోయి బైటికి పోతూంటాను. చెడ్డ చికాగ్గా వుంది విమలా! ఇక లాభం లేదు. వెంటనే నువ్వు వొచ్చెయ్యాలి! త్వరగా రావలెను.

నీ బుచ్చిబాబు

★ ★ ★

నా బుచ్చిబాబూ! మై డియర్!

నీ పస్తుల ఉత్తరం అందింది. నేను వొస్తున్నానని రాయకుండా నువ్వసలు స్టేషన్ కెందుకెళ్ళావ్? నేను రాలేదని విచారం వేసిందా? నాకేం జాలి వెయ్య లేదులే.

నువ్వన్నది నిజమే, నే నిక్కడ రోజులూ, తారీ ఖులూ, అన్నీ మర్చిపోతున్నాను. కాలం మహాభారంగా గడపాల్సిన వాళ్ళకీ ఆ లెక్కలన్నీ! ఆర్నెల్ల తర్వాత .... ఇక్కడ మా వాళ్ళతో .... నా స్నేహితుల్తో .... అబ్బా! మళ్ళీ వీళ్ళందర్నీ వొదిలి ఎలా బతగ్గలనో తెలీడం లేదు.

వారం రోజులు అన్నం తినలేదా? మంచిదే ఆరోగ్యానికీ, దేశానికీ కూడా! ఈ పూట అన్నం తినకపోతే ఏం పోతుందిలే అని మానేశావు కదా, మర్నాడు తెలిసిందా ఏం పోయిందో? ఏమీ పోలేదు కదూ? సర్లే, ఏదన్నా పోయినప్పుడు తినడం ప్రారంభిస్తే సరి. అయినా అది బద్ధకం అనుకుంటున్నావు నువ్వు. కాదు ఆకలి మందగించడం మంచిది కాదు. ఆరో గ్యంగా వున్న డాక్టర్ని సంప్రదించు!

నేను చేసిన పచ్చళ్ళన్నీ అలాగే వున్నాయా? అయితే ఫర్వాలేదు. అవి నాలుగైదు నెలల వరకూ పాడుకావు. నీకు పనికొస్తాయి.

పాలగిన్ని జాగర్తగా అలమార్లో పెట్టుకుంటే పోలా? ఆ మాత్రానికి నేను రావాలా? పైగా పిల్లిని పట్టుకుని దొంగపిల్లి అంటావా? వంటింట్లో గిన్నెడు పాలు మీగడ తేలుతూ కనపడుతోంటే తాగకుండా వెళ్ళగల పిల్లి ఈ సృష్టిలో వుంటుందా? నువ్వు పిల్లి జన్మ ఎత్తినా అలా వుండలేవు. అయినా నీ మాటలు వింటే పిల్లి యామనుకుంటుందీ! — "ఈ మానవుల కెంత స్వార్థం! ఆవుల్నీ మేకల్నీ కట్టేసి .... వాళ్ళేదో హక్కుదారుల్లాగ .... సిగ్గుల్లేకండా పాలన్నీ పిండుకుని తాగుతారు. ఎప్పుడన్నా మనం కాసిన్ని పాలు రుచి చూస్తే .... కొంపలంటుకుపోయినట్టు గోల చేస్తారు. పుట్టిళ్ళల్లో వున్న పెళ్ళాలకుకూడా రాసుకుంటారు, రాయడానికింకేమీ లేనట్టు! హి! హి! ఏం మను షులు!" అని నవ్వుకోదూ దాని ప్రియుడికి చెప్పి? ఛీ! మానవజాతి నెంత అల్పం చేశావు పిల్లి దృష్టిలో! నా కిక్కడ పిల్లి మొహం చూడాలంటే చచ్చే సిగ్గు వేస్తోంది. అందుకే నేనెప్పుడూ మనకి నోరుంది కదా అని నోరు లేని వాటి గురించి ఇవీ అవీ మాట్లాడకూడదంటాను.

నేను వెంటనే వొచ్చేయాలా? ఎందుకు? నీ ఇబ్బందుల్లో నే నివ్వగల సలహాలన్నీ ఇందులోనే రాశాను. నీ ప్రతి ఉత్తరానికీ వెంటవెంటనే రాస్తూ వుంటాలే. ఈ మాత్రానికి వెంటనే వొచ్చెయ్యాలా?

ఇక్కడే ఉంటాను,

**విమల**

**డి**యర్ విమ్లా!

నీ తిక్క ఉత్తరం అందింది. చదవడానికి సరదాగానే వుందిగానీ .... వొళ్ళు మండింది! ఏ బండికి వొచ్చేది ఆఖర్న ఒక్క వాక్యం అన్నా రాస్తావనుకున్నాను. అమ్మాయ్! సరదాకి కూడా వేళా పాళా వుండాలి. తారీఖులూ అవీ కుదరాలి. 'ఎందుకు రావాలీ' ఏమిటీ? నీ పెంకిరాతలూ నువ్వూను! పోనీలే అని ఈ సారికి క్షమిస్తున్నాను. ఇంక జాప్యం చెయ్యక వొచ్చెయ్యి! అసలు నిన్ను పంపడం నాది బుద్ధితక్కువై పోయింది. 'పోనీలే ఓసారి పుట్టింటి వాళ్ళని చూసి వొస్తుంద'ని జాలిపడి పంపితే, నన్నేడిపించే దొంగ వెధవ పిల్లని వెనకేసుకొస్తావా? నువ్వింక ఈ జన్మలో మీ ఊరు మొహం చూడగలవేమో ఆలోచించుకో!

పచ్చళ్ళన్నీ అయిపోయాయి. నిన్న కూచుని తినేసి ఖాళీ జాడీలు ఓ మూల పారేశా! నిన్నట్నించీ హోటల్ భోజనం ప్రారంభించా. అయినా, నాకా తిండి పడదనీ నీకు తెలుసు. నేను చదువుకునే రోజుల్లో హోటల్ కూడు తిని చచ్చే జబ్బుపడి బయటపడ్డ స్టోరీ నీకు గుర్తుంది కదూ? ఇవతల నేనింత ఇబ్బంది పడుతోంటే, నువ్వక్కడ హాయిగా కూచుని .... ఎందుకు రావాలని ప్రశ్నలేమిటి? తల్చుకుంటే వొళ్ళు మండిపోతోంది. నన్ను అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్నావా లేదా? అలాంటి భర్త దగ్గిరికి భార్య ఎందుకు రావాలీ ఏమిటి? అది నీ ధర్మం. కర్తవ్యం. బాధ్యత. విధి. డ్యూటీ. తెలిసిందా? సిగ్గొచ్చిందా? ఈ పూటే బైల్దేరి వొచ్చెయ్యి! నీ తలతిక్క నేనింక సహించదల్చుకోలేదు. ఇల్లంతా ఎలా వుందో తెలుసా? వొచ్చి చూడు! ఏ బండి కొచ్చేదీ రాయి!

నీ అగ్నిసాక్షి భర్త
**బుచ్చిబాబు**

★ ★ ★

**నా** అగ్ని సాక్షి భర్తకి,

నా ఏకైక సొంత భర్తకి,

నేను ఏ బండికీ రావడంలేదు. ఎందుకు రావాలో మళ్ళీ తెలీలేదు. సరే! నీ ఉత్తరానికి వరసక్రమంలో జవాబులు రాస్తాను. నేను సరదాకి తిక్క ఉత్తరం రాశానని దాన్ని చాలా అపార్థం చేసుకున్నావు. (1) అది సరదాకి రాసింది కాదు. (2) అది తిక్క ఉత్తరం కాదు.

అది నీకు అర్థం కాకపోతే అది నీ అజ్ఞానం!

పుట్టింటికి నన్ను నువ్వు పంపించడం ఏమిటి? ఇన్సల్ట్! 'నన్ను పంపడానికీ మానడానికీ ఎవడివి నువ్వు?' అని అడగాలని బుద్ధి పుడుతోంది. పోనీ బాగా మర్యాదతో, గౌరవంతో, 'ఎవరు తమరూ?' అంటున్నాను. చిన్నప్పుడు మా గ్రామరు మేష్టారి మీదపడి జుట్టు పీకాలన్నంత కోపం వొచ్చేది. ఏక వచనాన్ని బహువచనంలోకీ, బహువచనాన్ని ఏకవచనంలోకీ తెగ రాయించేవా రాయన. అది ఇప్పుడు ఇంత పనికొస్తుందని నా కేం తెలుసూ?

పచ్చళ్ళన్నీ అయిపోయాయా? హోటల్ తిండి మొదలు పెట్టావుగా? ఫర్వాలేదు. ఆ జాడీలన్నీ మూల పారేసి వుంచకపోతే కడిగేసి తుడిచేసి దాచెయ్యరాదూ? ఇంట్లో తిరగడానికి నీకే సుఖంగా వుంటుంది.

అవును, నీకు హోటల్ భోజనం పడక జబ్బు చేసిందని నువ్వు ఎప్పుడో చెప్పిన స్టోరీ నాకు బాగా గుర్తుంది. నాకు మీ ఊరి పంపు నీళ్ళు పడక అస్తమానూ వేడిచేసే సంగతీ, కాల్టెక్స్ వాళ్ళు వొదిలే గ్యాసు కంపు పడకా, ఇంట్లో నీ సిగరెట్ల కంపు పడకా, వికారపెట్టే ఘట్టాలన్నీ నీకూ గుర్తున్నాయి కదూ? నీకు వొండి పెట్టడం కోసం నా ఆరోగ్యం పాడుచేసుకొనేంత త్యాగం ఎందుకు చెయ్యాలి నేను? నా ధర్మమా? నా కర్తవ్యమా? .... అయితే అదేదో నేను చూసుకుంటాను. నా ధర్మం నాకు తెలీదని నువ్వెందుకనుకుంటావూ? ధర్మాలూ .... బాధ్యతలూ బోదిస్తే వస్తాయా, అంతరంగంలోంచి పొంగుకుని రావాలిగానీ! 'గాలి పీల్చడం నా ధర్మం, నా విధి' అనుకుని గాలి పీలుస్తామా, పీల్చకుండా బతకలేకగానీ! అంత సహజ ధర్మాలే ధర్మాలుగానీ, భర్తకి వొంట వొండడం, జాడీలు తోమడం, పిల్లల్ని తోలడం, ఇవా ధర్మాలు? ఇవన్నీ ఉత్త దరిద్రపు చాకిరీ!

ఇల్లంతా ఎలావుందో చూడ్డానికి నే రాదల్చుకోలేదు. కావాలంటే ఫొటోలు తీసి పంపించు. నా సలహాలు రాస్తాను. నువ్వు నివసించే ఇల్లు .... నువ్వే పరిశుభ్రంగా వుంచుకుంటే నువ్వే సుఖపడతావు. ఉంచుకోకపోతే నువ్వే కష్టపడతావు.

నే నిక్కడ చాలా సుఖంగా వున్నాను. మా అమ్మ

నాకెంతో ఇష్టమైన కూరలన్నీ వొండిపెడుతోంది. మా అన్నయ్య రోజూ సినిమాలకు తీసుకెళ్తున్నాడు. నా స్నేహితులతో కాలక్షేపం చేస్తూ చాలా హాయిగా వున్నాను. ఇవన్నీ వొదిలిపెట్టి నీకోసం ఎందుకు రావాలో నాకు అర్థం కావడం లేదు.

ఇక్కడే వుంటాను

**విమల**

★ ★ ★

**భా**ర్యామణీ!

నీ వ్యవహారం ముదిరి పాకాన పడుతోందే! ఎంతో మంచివాణ్ణి! నాకే కోపం తెప్పిస్తున్నావు. ఏదో మొదటి ఉత్తరం సరదాకి రాశావుకదా అనుకున్నాను. ఇవ్వాల్టికి రొండు వారాలు నువ్వెళ్ళి! ఏమిటీ తమాషా? ఇంత మొండిదాని వయ్యావేం? పాడు ఊరు. మీ ఊరు వాళ్ళంతా ఇంతేనా? కేకలేసి పంపించరూ? ఆర్నెల్లి క్కడా .... ఆర్నెల్లక్కడా వుంటావా ఏమిటి? బాగానే వుంది.

సరే! నా కష్టచరిత్ర రాస్తున్నాను చూడు. ఇల్లంతా సర్దుకోమన్నావు కదా? ఆ పనే చేద్దామని నిన్న హఠాత్తుగా లేచాను. వీధి తలుపులు మూసేశాను. ఇల్లు అందంగా సర్ది బార్లాతీసి అందర్నీ పిలుద్దామనీ! బట్ట లన్నీ ఓ మూలవి తీసి ఇంకో మూలకీ విసిరేశాను. పత్రికలూ, పుస్తకాలూ దులిపి మళ్ళీ బల్లనిండా పెట్టాను. మొన్న నాలుగు రోజులు పనిమనిషి రాలేదు. ఎంత కోపం వచ్చిందంటే, ఆ మనిషిని పని లోంచి తీసేద్దామనుకున్నాను. అసలు రానిమనిషిని తీసెయ్యడం ఎలాగ? .... సర్దడం సంగతి కదూ? అబ్బ! చీపురు కోసం ఎంత వెదికా ననుకున్నావూ? తలుపుల వెనక .... మంచాల వెనక .... కుర్చీల వెనక .... గోడల వెనక .... నా వెనక! చీపుర్ని ఇంత రహస్యంగా .... ఇంత నేర్పుగా దాచగల పని మనిషిని మనం వొదులుకోకూడదు విమలా! అప్పుడేం చేశానో తెలుసా? వాకిట్లోకి పోయి గోడలమీంచి తొంగిచూసి "చీపురుందాండీ?" అనేశా. ఆవిడ అదోలా నవ్వి (ప్రేమగా అనుకునేవు) జాలిగా నవ్వి — "ఎందు కండీ?" అంది. అడిగింది ఇవ్వరాదూ? ఎందుకట! చీపురెందుకూ? — "అబ్బే! ఏం లేదండీ! ఊరికేనే" అన్నా గడుసుతనంగా. నమ్మేసినట్టుంది. నవ్వుతూ ఇచ్చింది. చీపురు దొరగ్గానే కావలించుకో బుద్ధేసింది విమ్లా! అంత మెత్తగా .... పట్టుకుచ్చులా ఉందనుకో. ఎక్కడ కొన్నారో అడిగి అలాంటివి ఒక వంద చీపుళ్ళు కొనిపెట్టెయ్యనా ఇంట్లో? వొద్దంటావా?

మొన్నేమైందో తెలుసా? తాళంచెవి ఎక్కడో పారేశాను. ఛీ! పారేశానేవిటి! అదే పోయింది. ఇంజనీర్ని తీసుకొచ్చి తాళం బద్దలుగొట్టాల్సి వొచ్చింది. నువ్వే వుంటే ఈ గోలంతా లేదుకదా?

చీకట్నే లేచి పాలు తీసుకోడం మహాకష్టంగా వుంది విమలా! — మొన్నాదివారం మిట్టమధ్యాన్నం నేను గాఢంగా నిద్రపోతూంటే పక్కింటి వాళ్ళ పిల్ల దబదబా తలుపులు బాదేసి .... లేపేసి .... "మంచి జీడి గింజలు వొచ్చాయి. చవగ్గా ఇస్తున్నాడు. మా అమ్మమ్మ కొంటోంది. మీకూ కావాలేమో అడగ మంది" అని తెగ నస పెట్టింది. నాకేం తెలుసు? హాయిగా జీడిపప్పు కొనుక్కోక ఈ గింజ లెవడు కాలుస్తాడని నువ్వు మండిపడితే? హడలిపోయి వొద్దు పొమ్మన్నాను. ఆ మర్నాడు మళ్ళీ కుంకుడుకాయల గోల! ఎవడో మంచికాయలు తెస్తానన్నాట్ట, కొనాలా? కొనాలంటే రాయి. అసలు రాయడం ఏమిటి? వొచ్చెయ్యి! పెళ్ళాం పుట్టింటికెళ్ళి రానని మొండికేసి నప్పుడు, హఠాత్తుగా కుంకుడుకాయలు అమ్మొస్తే కొనాలో అక్కర్లేదో మా అమ్మమ్మ చెప్పలేదు. ఏ బండి కొచ్చేదీ రాయక్కర్లేదులే. నీ కిష్టం అయితే గూడ్సులో అన్నా వొచ్చేస్తావు. వొచ్చేద్దూ విమలా! మంచిదానివి!

తాజాకలం! నీ కోసం అందమైన తెల్ల చీర కొని వుంచాను. సన్నజాజులంత చిన్నపువ్వుల బార్డరు. నీకు చాలా నచ్చుతుంది. నా మాట నమ్మకపోతే వొచ్చి చూడు! మళ్ళీ వెర్రిమొర్రి ఉత్తరం రాయకు సుమా!

నీ

**బుచ్చిబాబు**

★ ★ ★

**నా** డియర్ బుచ్చిబాబూ!

లేదా, డియర్ నా బుచ్చిబాబూ!

నువ్వు రాసిన ఈ ఉత్తరంకూడా బాగానే అందింది, నాకు నిరాశ కలిగిస్తూ.. ఇక ఈ చెత్త ఉత్త

రాలు నేను చదువలేను. "మీ ఆయన తెగ రాస్తున్నాడు వెళ్ళిపోతావా?" అన్నారు నా ఫ్రెండ్సు. "అబ్బే! ఎందుకు వెళ్తానూ" అన్నాను నేను. అవును. ఎందుకు రావాలీ! కుంకుడు కాయలూ, జీడిగింజలూ కొనాలో లేదో తేల్చడానికేగా? ఏం ఫర్వాలేదు. కొనమని రాస్తే పోలా? కొనక్కర్లేదని రాస్తే పోలా? ఈ మాత్రానికే అర్జంటుగా బయల్దేరాలా, సిగ్గుచేటు!

పక్కింటి వాళ్ళ చీపురిచ్చేశావా? చీపుర్ని అంత గొప్పగా వర్ణించిన నీ కవితాశక్తికి నా జోహార్లు! అయినా అది పక్కింటి వాళ్ళ చీపురదృష్టం! మన చీపురన్నా కాదు. పక్కింటామె నిన్ను చూసి ప్రేమగా నవ్వనందుకు నాకు చాలా అవమానంగా వుంది. పైగా, జాలిగా నవ్వినందుకు కోపంగా వుంది. సరే! నే నింక నీ దగ్గిరికి రానండీ భర్తగారూ! మా ఊళ్ళో వాళ్ళు కేకలేసి కాపరాలు చేయించరు. మొన్ననే వో లాయరుతో సంప్రదించాను. నా సొంత అగ్నిసాక్షి భర్తకు విడాకు లిచ్చెయ్యాలని.

"ఏమిటి కథ? తిడతాడా? కొడతాడా" అన్నాడు.

"తిట్టాలా, కొట్టాలా? పెళ్ళయిన దగ్గిర్నించీ ఆర్నెల్ల వరకూ భర్తనే అంటిపెట్టుకుని వుండి .... కొత్తగా పుట్టింటికి వెళ్ళిన పెళ్ళానికి, 'ఇంట్లో దుమ్ము తుడవాలి. కుంకుడుకాయలు కొనాలి. పిల్లి రాకుండా, తాళాలు పోకుండా, ఇల్లు కాపలా కాయాలి. చీకట్నే లేచి పాలు తీసుకోవాలి. ఇలాంటి పనులన్నీ వుంటాయి కాబట్టి వొచ్చెయ్యి — అని అవమానించే ఉత్తరాలు రాయడం చాలదా? పైగా చీరకొన్నాట్ట! చీరలకోసం, గాజులకోసం పడిచచ్చే రకం అన్నమాట నేను! కావాలంటే నా కొచ్చిన ఉత్తరాలన్నీ కోర్టులో పెడతాను. విడాకు లడగడానికి ఇంతకన్నా బాధలేం వొచ్చిపడాలి?" అన్నాను.

ఆ లాయరు నిర్మొహమాటంగా నవ్వి "చాలదు. జడ్జీ వొప్పుకోడు" అన్నాడు.

"ఎందుకొప్పుకోడు? కాస్త శృంగార భావాలు గల ఆడపిల్ల .... ఇలాంటి మొద్దు మొగుడితో ఎలా కాపరం చెయ్యగలదను కుంటాడా జడ్జీ?" అని సూటిగా అడిగాను.

"అంతే. చెయ్యాలి. వొకరి లోట్లు వొకరు క్షమించాలి. సరిదిద్దుకోవాలి" అన్నాడు.

"ఏవిటీ! నా మొగుణ్ణా! సరిదిద్దడమా!"

భలే! నా కెంత నవ్వొచ్చిందంటే, నవ్వితే నాకే కష్టాలూ లేవనుకుంటాడని .... సినిమాలోలాగా ఏడ్చే మొహంతో "ముందు మీరీ ఉత్తరాలు చదివి మాట్టాడండి!" అని ఆ చెత్తంతా ఆయన మొహాన పారేశాను.

అన్నీ చదివి ముసిముసి నవ్వులు నవ్వాడు.

"అలా నవ్వడం కాదు. నాకు అర్జంటుగా విడాకు లిప్పించండి" అని పోట్లాడాను.

"అలా వీల్లేదమ్మాయ్! మన న్యాయశాస్త్రాలు వొప్పవు" అన్నాడు మహాకర్కశంగా.

నాకు ఒళ్ళుమండి — "వొప్పవూ? వొప్పకపోతే పొమ్మను. మీ న్యాయ శాస్త్రాలన్నీ కలిసి నన్నెలా మొగుడి దగ్గిరికి పంపిస్తాయో నేనూ చూస్తాను" అని సవాల్‌చేసి వొచ్చేశాను. అసలీ లాయర్లకీ, జడ్జీలకీ, ఎవ్వరికీ, పెళ్ళాలకెలాంటి ఉత్తరాలు రాయాలో తెలీదని నా గాఢ నమ్మకం. లేకపోతే నా బాధెందు కర్థం కాదూ? ప్రేమకోసం ఆరాటపడే వొక హృదయానికి న్యాయం చెయ్యలేనివన్నీ న్యాయశాస్త్రాలా, ఉత్త అన్యాయ శాస్త్రాలుగానీ ....! సరేలే!

విమల

★ ★ ★

వెయ్యేళ్ళకీ ....

వెయ్యి జన్మలకీ .... ఎప్పటికీ ....

నాదే అయిన విమలకు! విమలా!

నన్ను క్షమించు విమలా! నేను మహామూర్ఖుణ్ణి! నిన్నెంత బాధపెట్టానో నా అసహ్యపు రాతలతో! నీ సున్నితమైన మనసు .... ఎంతో గాయపరిచాను. ఇప్పుడు తల్చుకుంటే నాకెంత సిగ్గుగా వుందో నీకు తెలీదు విమలా! నువ్వు లేని ఈ కాలం అసలు నాకు గడిచిందా — స్తంభించింది గానీ! నీ ఎడబాటు ఇంత భారంగా వుంటుందని నాకు ముందే అర్థమైతే — నిన్ను వెళ్ళవద్దని, బతిమాలుకునే వాణ్ణి. లేకపోతే నన్నుకూడా నీతో తీసుకుపొమ్మనే వాణ్ణి. నా మీద జాలి కలిగి తొందరగా వొస్తావు కదా అని, లేని కష్టాలన్నీ సృష్టించి రాశాను. రాజమార్గం వదిలేసి .... తప్పు

దారులు తొక్కాను. అది నా అజ్ఞానమేగాని .... నీకు తక్కువ విలువ కల్పించలేదు విమలా!

అసలు నువ్వీ ఇంట్లో నన్ను కూర్చోబెట్టి, నా రుచి కోసం, నా సౌకర్యం కోసం, తగని పనులన్నీ కల్పించు కుని చేసి చేసి, విసిగెత్తిపోయావేమో ననిపించింది ఎన్నోసార్లు. నీకు సహాయం చేసి నీ శ్రమ పంచు కున్నట్టు నా కేమీ గుర్తులేదు. ఇక్కడ జీవితం నీకు భారంగా వుందేమో, నా ప్రవర్తనవల్ల నీ కేమీ ఆనందం కలగటంలేదేమోనని వొకటే ఆలోచనగా వుంది నాకు ఇప్పుడు.

నీకు అక్కడ సంతోషంగా వుంటే ఎన్నాళ్ళయినా వుండు విమలా! నే నేమీ ఇబ్బందిపడటం లేదు. కానీ .... నే ననుభవిస్తోన్న గొప్పకష్టం నీ ఎడబాటే! నువ్వు నన్నింత వశం చేసుకున్నావని నా కింతవరకూ తెలీదు. నా శాంతి .... నా సుఖం .... నా ఆనందం .... నా సమస్తం .... నువ్వు పట్టుకుపోయావు. అసలు నువ్వు నా జీవితంలోకి రానప్పుడు నేనెలా జీవించానో, ఎందుకు జీవించానో, ఇప్పుడర్థం కావడం లేదు. నిన్ను చూస్తూ వుంటే ఎప్పుడూ ఏదో సంతోషంతో .... నాకే అర్థంకాని ఏదో ఆనంద పారవశ్యంతో, ఓలలాడుతూ వుంటాను.

మొన్న పౌర్ణమినాడు నువ్వులేక పోయినా నాకు బీచికే వెళ్ళాలనిపించింది. చాలాసేపు కూచున్నాను. బాగా రాత్రి అయింది. అందరూ వెళ్ళిపోయారు. సముద్రపొడ్డున నేనొక్కణ్ణే! ఎంత వొంటరితనం! నిజంగా భయం వేసింది. అలాగే కూచున్నాను .... సముద్రం నిండా ఎంత వెన్నెల! దాన్ని చూసి సము ద్రుడి కెంత ఆనందం! వెన్నెల అందం బొత్తిగా అనుభవించలేని మూర్ఖుణ్ణి అయ్యాను. నా మనసంతా నీది చేసేసుకుని .... నా ఆలోచన నిండా నువ్వే నిండి .... ఎక్కడా నిలబడనివ్వక, ఏమీ తోచనివ్వక, ఉత్త వెర్రివాణ్ణి చేశావు.

నువ్వెందుకలా రాస్తున్నావో ఆలోచిస్తే నీ అశాంతి చాలా ఆలస్యంగా అర్థమైంది విమలా! నీ మీద నా ప్రేమని విని నువ్వెంత ఆనందిస్తావో గ్రహించలేని మందమతిని. క్షమించు విమలా! నాలో అణువణువూ వొక్కొక్క హృదయమై .... నిన్ను ప్రేమిస్తోంది. ఒక్కొక్క శరీరమై నిన్ను కాంక్షిస్తోంది. ఈ ప్రేమని .... మాటలలో చెప్పటం అసంభవం నాకు!

నీ తల్లి చల్లని ప్రేమకన్నా, నీ స్నేహితుల మమ కారం కన్నా .... విలువైన ఆనందం నేనేమీ ఇవ్వలేను. కానీ నేను నీ వాణ్ణి! నీ ప్రణయార్థిని! నీ మనో మందిరం ముందు నిలబడతాను .... ప్రతి దినమూ .... ప్రతి క్షణమూ!

ఏ కారణం చేతనన్నా మనం విడిపోతామేమో! ఇంక వొక్కసారికూడా నిన్ను చూడనేమో — అని ఎందుకో చాలా దిగులు కలుగుతోంది. జరిగిందంతా తియ్యని కలేమో .... అసలు నాకు నీతో ఏమీ సంబంధం లేదేమో అన్నంత భ్రమ కలుగుతోంది. నిజంగా మనం మళ్ళీ కలుసుకుంటామా?

నీ నుంచి ఇన్నాళ్ళు దూరంచేస్తే నే నెలా వుండ గల ననుకున్నావు? ఎప్పుడూ నన్ను ప్రేమగా చూసే నీ అందమైన కళ్ళు .... మధురంగా నన్ను తాకే నీ ముద్దు చెక్కిళ్ళు .... నిద్రలో నా చుట్టూ నీ వెచ్చని కౌగిళ్ళు .... నా కెంతో హాయి కలిగించే నీ జుట్టు పరిమళాలు .... నీ నవ్వులు, నీ కంఠస్వరం, నన్ను తన్మయుణ్ణి చేసే నీ సామీప్యం — అన్నీ నాకు ప్రసాదించటానికి రా విమలా!

నా భయాలన్నీ పోగొట్టి, నాకు ధైర్యం చెప్పడానికి రా విమలా!

నీ మధుర ప్రేమాలింగనాలలో నన్ను తరింప చెయ్యటానికి రా విమలా!

క్షణక్షణమూ ఆశతో,
నీరీక్షణతో,
నీ ప్రేమార్థి.
**బుచ్చిబాబు**

★ ★ ★

**బు**చ్చిబాబుకి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం!

ఒక గంటలో నేను మెయిల్‌కి బయలు దేరుతున్నాను.

**విమల**

[1971 ఏప్రిల్ 'వసుధ' మాసపత్రికలో] ★